## క్లుప్తంగా

### ఘనంగా ధరణి 15వ వార్షిక మహాసభ



మాట్లాడుతున్న మేరీవటమట్టం

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలో టింబక్టు–కలెక్టివ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధరణి వ్యవసాయ సహకార సొసైటీ 15వ వార్షిక మహాసభ శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సంస్థ వ్యవస్థాపకురాలు మేరీ వటమట్టం మాట్లాడుతూ 15 ఏళ్లుగా సేంద్రీయ వ్యవసాయంలో రైతులకు ధరణి సొసైటీ తోడ్పడుతోందన్నారు. రామగిరి, చెన్నేకొత్తపల్లి, రొద్దం మండలాల్లో సేంద్రీయ వ్యవసాయ విధానంలో పంట సాగు చేయించి తమ సంస్థ వాటిని కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సొసైటీ అధ్యక్షులు అక్కులమ్మ, ప్రోగ్రాం మేనేజర్లు సుకన్య, శ్రీకాంత్, సీఈఓలు చిరంజీవి, నరసింహ, రమీజా తదితరులు పాల్గొన్నారు.

### రేపు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఈనెల 31వ తేదీన కౌన్సిల్ సమావేశం నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కౌన్సిల్ సమావేశానికి కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, కో–ఆప్షన్ సభ్యులు తప్పకుండా హాజరుకావాలని సూచించారు.

### పర్యావరణ పరిరక్షణకు కృషి



మొక్కలు నాటుతున్న సీఐ మధు

కదిరి టౌన్: పర్యావరణ పరిరక్షణలో భాగంగా స్థానిక పట్టణ పోలీస్‌స్టేషన్ ఆవరణలో శనివారం సీఐ తమ్మిశెట్టి మధు ఆధ్వర్యంలో పోలీసులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, పర్యావరణాన్ని పరిరక్షించాలన్నారు. ఎవరైనా వాల్టా చట్టం అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చెట్లు నరికేస్తే అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు.

### ఆర్థికసాయం అందజేత



తనకల్లులో మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న నాయకులు

తనకల్లు: స్థానిక దళితవాడకు చెందిన నరసింహులు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డి శనివారం రూ.10 వేల ఆర్థికసాయం పంపించారు. ఆ మొత్తాన్ని మండల కన్వీనర్ మధుసూదన్‌రెడ్డి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ రామ్‌దేశాయ్ తదితరులు మృతుడి కుటుంబానికి అందజేశారు. అలాగే ఈతోడుకు చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త రామప్ప గుండెపోటుతో మృతి చెందాడు. సర్పంచ్ నాగేంద్ర, నాయకులు రామమోహన్‌రెడ్డి, శంకర్‌రెడ్డి తదితరులు ఎమ్మెల్యే సమకూర్చిన రూ.10 వేల నగదును బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు బీఎస్ నిజాం, మౌలి, బాల్‌రెడ్డి, ఎస్సీ నాయకులు శ్రీనివాసులు, డీలర్ నరసింహులు, తిమ్మయ్య, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

### చిల్లకొండయ్య పల్లిలో 20 చీనీచెట్ల నరికివేత



చీనీచెట్లను పరిశీలిస్తున్న ఎస్‌ఐ లక్ష్మీనారాయణ

తాడిమర్రి: మండలంలోని చిల్లకొండయ్యపల్లిలో దూదేకుల బాబు అనే రైతుకు చెందిన 20 చీనీచెట్లను గుర్తు తెలియని దుండగులు నరికేశారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు.. దూదేకుల కుళ్లాయప్పకు ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు రాజు ఉపాధ్యాయుడిగా ఉద్యోగం చేస్తుండగా అతని తమ్ముడు బాబు తమకున్న 2.70 ఎకరాల వ్యవసాయ భూమిలో మూడేళ్ల క్రితం 370 చీనీ మొక్కలు సాగు చేశాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత గుర్తు తెలియని దుండగులు చీనీతోటలో 15 చీనీచెట్ల పూర్తిగా.. ఐదు చెట్లను పాక్షికంగా నరికివేశారు. శనివారం ఉదయం 6 గంటలకు రైతు బాబు తోటవద్దకు వెళ్లాడు. నరికి పడేసిన చెట్లను చూసి ఆవేదన వ్యక్తం చేశాడు. తాము ఏ రాజకీయ పార్టీలకు చెందిన వారము కాదని కేవలం రాజకీయ చిచ్చు కోసం కొందరు ఇలా చేసి ఉంటారని తెలిపాడు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ లక్ష్మీనారాయణ సిబ్బందితో కలసి తోటను పరిశీలించారు. సంఘటనపై ఆరా తీసి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ సూర్యనారాయణ, హెడ్‌కానిస్టేబుళ్లు రామకృష్ణ, నల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

# భక్తజన పరవశం

- భక్తిశ్రద్ధలతో జలధి కార్యక్రమం
- చదివింపులు చేయించి మొక్కులు చెల్లించుకున్న భక్తులు

బత్తలపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం మొహర్రం సందడి నెలకొంది. పీర్లకు జలధి కార్యక్రమం నిర్వహించారు. బత్తలపల్లిలో పీర్ల భేటీని ఆనందంతో తిలకించారు. పీర్లను చూసేందుకు భారీ సంఖ్యలో ప్రజలు రావడంతో కూడలి కిక్కిరిసిపోయింది. నాలుగు రోడ్లకు ఇరువైపులా కిలోమీటర్ల మేర వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. భక్తులకు ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ధర్మవరం రూరల్ సీఐ ఆరోహణరావు, బత్తలపల్లి, ధర్మవరం టూటౌన్ ఎస్‌ఐలు టీవీ శ్రీహర్ష, శేషగిరి, 50 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహించారు. జనసందోహాన్ని కట్టడి చేశారు.

**నేడు వెంకటగారిపల్లి సత్రం వద్ద భేటీ..**

మండలంలోని వెంకటగారిపల్లి సత్రం వద్ద మాల్యవంతం, వెంకటగారిపల్లి, అనంతసాగరం, లింగారెడ్డిపల్లి గ్రామాలకు చెందిన పీర్లు ఆదివారం భేటీ అవుతాయి. సాయంత్రం జలధి కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. శనివారం బత్తలపల్లి కూడలిలో భేటీ తీసుకున్న గ్రామాల్లో కూడా ఆదివారం జలధి కార్యక్రమం జరుగుతుందని గ్రామ పెద్దలు తెలిపారు. బత్తలపల్లిలో మాత్రమే శనివారం జల్దీ కార్యక్రమాన్ని నిర్వహించారు.

**ధర్మవరం పట్టణంలో..**

ధర్మవరం అర్బన్: పట్టణంలోని సిద్దయ్యగుట్ట, యాదవవీధి, కొత్తపేట, లోనికోట, తేరుబజార్‌లలోని పీర్ల చావిడి కమిటీల ఆధ్వర్యంలో శనివారం మొహర్రం వేడుకలు జరిగాయి. పీర్లస్వాములను ఎత్తుకుని అగ్నిగుండంలో ప్రవేశిస్తూ పండుగను సంబరంగా జరుపుకున్నారు.

**వీధుల్లో పీర్ల ఊరేగింపు**

తాడిమర్రి: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం మొహర్రం వేడుకలు వైభవంగా నిర్వహించారు. తాడిమర్రి, కునుకుంట్ల, పిన్నదరి తదితర గ్రామాల్లో గ్రామస్తులు ఉత్సవాలను ఘనంగా జరుపు కున్నారు. తాడిమర్రిలో జరిగిన ఉత్సవాల్లో ముజావర్లు.... కుళ్లాయస్వామి, అగుబోడప్ప, హుస్సేన్, హస్సేన్ తదితర పీర్లకు నూతన వస్త్రాలు కట్టి, వెండి గొడుగులు తొడిగి, పూలమాలలతో అందంగా అలంకరించారు. తెల్లవారు జామున 4.30 గంటల నుంచి ఉదయం 9 గంటల వరకు గ్రామంలో పీర్లను డప్పులు, మేళతాలాలతో ఊరేగించారు. అలాగే సాయంత్రం 4 గంటలకు పీర్లను గ్రామ ప్రధాన వీధుల్లో ఊరేగించి, అగ్నిగుండం ప్రవేశం చేశారు. ఈ సందర్భంగా భక్తులు పీర్లకు చెక్కెర, బెల్లం చదివించి మొక్కులు తీర్చుకున్నారు.

**హిందూ ముస్లింల ఐక్యతకు ప్రతీక మొహర్రం**

పుట్టపర్తి టౌన్: హిందూ ముస్లింల ఐక్యతకు ప్రతీక మొహర్రం అని ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి అన్నారు. శనివారం పుట్టపర్తి పట్టణంలో, కొత్తచెరువు మండలం కొపడగానిపల్లి గ్రామంతో పాటు నియోజకవర్గ వ్యాప్తంగా మొహర్రంను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పుట్టపర్తి, కొడపగానిపల్లి గ్రామాల్లో నిర్వహించిన మొహర్రం వేడుకల్లో ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి పాల్గొని చదివింపులు చేయించారు. పార్టీలకు అతీతంగా మొహర్రం జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబుళపతి, వైస్ చైర్మన్ తిప్పన్న, కౌన్సిలర్ చెరువు భాస్కర్‌రెడ్డి, సాయిగీత, పట్టణ కన్వీనర్ రంగారెడ్డి, మాజీ నెడ్ క్యాప్ డైరెక్టర్ మాధవరెడ్డి, మాజీ కౌన్సిలర్ నారాయణరెడ్డి, ఫోటో సాయి, పట్టణ మహిళా అధ్యక్షురాలు కవిత, కొత్తచెరువు మండల కన్వీనర్ జగన్‌మోహన్‌రెడ్డి, నాయకులు రఘునాథరెడ్డి, రెడ్డెప్ప రెడ్డి, నరసింహా రెడ్డి, శ్యాంసుందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కనగానపల్లి: మండల కేంద్రంలో జరిగిన దస్తగిరి, వన్నూరుస్వామి జలధి కార్యక్రమాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. యలకుంట్ల, నరసంపల్లి గ్రామాల్లో కూడా మొహర్రం వేడుకలు జరిగాయి.



ధర్మవరం అర్బన్: పట్టణంలో ఊరేగుతున్న పీర్లు



తాడిమర్రిలో పీర్లను జలధికి తీసుకెళ్తున్న భక్తులు



తాడిమర్రి: అలంకరణలో కుళ్లాయిస్వామి



ధర్మవరం అర్బన్: అగ్నిగుండ ప్రవేశం చేస్తున్న పీర్లస్వామి



బత్తలపల్లిలో ఊరేగుతున్న పెద్ద ఖాశీంస్వామి



పుట్టపర్తిటౌన్: పీర్లకు చదివింపులు చేయించిన ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి



కనగానపల్లిలో జలధికి తరలిపోతున్న పీర్ల స్వాములు



బత్తలపల్లిలో అలావ్ తొక్కుతున్న యువకులు

# రాజకీయాలకు అతీతంగా పథకాలు



నల్లచెరువులో పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డి



ప్రశాంతి నిలయం: బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

- ఎమ్మెల్యేలు డాక్టర్ పీవీ సిద్దారెడ్డి, దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

నల్లచెరువు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రాజకీయాలు, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను ప్రజలకు అందజేస్తున్నామని ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి అన్నారు. నల్లచెరువు సచివాలయం–2 పరిధిలోని నల్లచెరువు, కమ్మువారి పల్లి, యనమలవారిపల్లి, పులిమి వారి పల్లి, పత్రువాండ్లపల్లి గ్రామాల్లో శనివారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. పథకాల ద్వారా ప్రతి కుటుంబానికి చేకూరిన లబ్ధిని వివరిస్తూ బుక్‌లెట్లను అందజేశారు. పరిష్కారానికి నోచుకోని సమస్యలుంటే తెలియజేయాలని కోరారు. సిమెంట్ రోడ్డు వేయాలని నల్లచెరువు, పత్రువాండ్లపల్లి గ్రామస్తులు ఎమ్మెల్యేకు విన్నవించారు. వెంటనే ఇంజినీరింగ్ అసిస్టెంట్‌తో మాట్లాడిన ఎమ్మెల్యే.. రోడ్ల ఏర్పాటుకు అంచనాలు సిద్ధం చేయాలని ఆదేశించారు. అన తరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి జగన్ ఆదేశాల మేరకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. నల్లచెరువు మండలంలోని ప్రతి గడపనూ సందర్శించి ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తున్నామన్నారు. గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి వలంటీర్ల ద్వారా అర్హత కలిగిన ప్రతి లబ్ధిదారుడి ఇంటి వద్దకే సంక్షేమ పథకాలను అందజేస్తున్నామన్నారు. మండలంలో ఈ కార్యక్రమాన్ని ఇంత పెద్ద ఎత్తున విజయవంతం చేసిన సందర్భంగా పత్రువాండ్లపల్లిలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కె.రమణారెడ్డి, వైస్ ఎంపీపీ నారాయణస్వామి, సర్పంచ్ పంచరత్నమ్మ, శ్రీనాథ్‌రెడ్డి, యూసుఫ్, ఎంపీటీసీలు లక్ష్మీదేవి, భాస్కర్‌రెడ్డి, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ నాగభూషణ, సింగల్ విండో అధ్యక్షుడు జయచంద్రారెడ్డి, అగ్రీ అడ్వైజరీ బోర్డు చైర్మన్ ముస్తఫా, డైరెక్టర్ ఆదిమూర్తి, టెంపుల్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, మాజీ చైర్మన్ ఆనంద్‌రెడ్డి, మాజీ సర్పంచులు నరసింహారెడ్డి, రవికుమార్ రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ రాజశేఖర్, నాయకులు డాక్టర్ శంకర్, బట్టీ హైదర్ వలి, వెంకటరెడ్డి, శేఖర్‌రెడ్డి, రఫీ, యుగంధర్ రెడ్డి, ఆది, రామంజనేయులు, సూర్యనారాయణ రెడ్డి, మల్లికార్జున రెడ్డి, కాంతారావు, సానే హరినాథ్‌రెడ్డి, రామచంద్ర, నజీర్, మల్లిరెడ్డి, పోలీస్ రెడ్డెప్ప, టైలర్ రామాంజి, తదితరులు పాల్గొన్నారు.

**సంక్షేమం కొనసాగాలంటే.. మళ్లీ జగనన్నే రావాలి**

ప్రశాంతి నిలయం: రాష్ట్రంలో సంక్షేమ పాలన కొనసాగి పేదలందరూ సుఖసంతోషాలతో ఉండాలంటే అన్ని వర్గాల ప్రజలు ఏకమై మళ్లీ వైఎస్ జగన్‌ను ముఖ్యమంత్రిగా చేసుకోవాలని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి కోరారు. పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని 12, 14 వార్డుల పరిధిలో శనివారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరిస్తూ బుక్‌లెట్లు అందజేశారు. ప్రజల నుంచి అందిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని అక్కడే ఉన్న అధికారులను ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎల్లో మీడియాను అడ్డు పెట్టుకుని టీడీపీ, జనసేన పథకాలపై తప్పుడు ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. వైఎస్ జగన్‌ను ఎదుర్కొలేక చంద్రబాబు, పవన్ కళ్యాణ్ దొడ్డిదారుల్లో కుట్రలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. రాబోవు రోజుల్లో ప్రజలకు వారికి తగిన గుణపాఠం నేర్పుతారన్నారు. అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్రంలో ఇరిగేషన్ ప్రాజెక్ట్‌లపై నిర్లక్ష్యం చేసిన చంద్రబాబు ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తూ ప్రాజెక్ట్‌ల పర్యటన చేస్తాననని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలనను రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు గమనిస్తున్నారన్నారు. 2024లో టీడీపీ, జనసేనకు ప్రజలు బుద్ధి చెప్తారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తుంగా ఓబులపతి, వైస్ చైర్మన్ తిప్పన్న, ఎంపీపీ రమణారెడ్డి, పుడా చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ, పట్టణ కన్వీనర్ రంగారెడ్డి, మెప్మా అధ్యక్షురాలు సాయిలీల, కౌన్సిలర్లు సాయిగీత, చెరువుభాస్కర్ రెడ్డి, సాయిలీల, సహకార సంఘం అధ్యక్షుడు రుషీకేశవరెడ్డి, మాజీ కౌన్సిలర్ నారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు భాస్కర్‌రెడ్డి, నాగిరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, ఓబుల్ రెడ్డి, కృష్ణారెడ్డి, రంగా రామాంజినేయులు, సుబ్రహ్మణ్యం, బీరే నారాయణ, కవిత, గాజుల వెంకటేష్, శ్రీరాములు, గంగాద్రి, కేశప్ప, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# డీ.రామాపురంలో తీరిన తాగునీటి సమస్య



తాగునీటి సరఫరాను ప్రారంభిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్ శశికళ

నల్లమాడ: మండలంలోని డీ.రామాపురంలో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి చొరవతో తాగునీటి సమస్య తీరింది. గ్రామంలో 75 కుటుంబాలున్నాయి. తాగునీటి పథకం నీరు అన్ని వీధులకు సక్రమంగా సరఫరా అయ్యేది కాదు. ఎక్కడ కొళాయి ఉంటే అక్కడికెళ్లి నీరు తెచ్చుకోవాల్సిన పరిస్థితి. దీంతో వృద్ధులు, వికలాంగులు తాగునీటి కోసం అవస్థలు పడేవారు. కొద్ది రోజుల క్రితం సమస్యను స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే జల జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కొళాయి ఏర్పాటు చేయాలని గ్రామీణ నీటి విభాగం అధికారులను ఆదేశించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కుళ్లాయినాయక్ పైప్‌లైన్ వేయించి ఇంటింటికీ కొళాయిలు ఏర్పాటు చేయించారు. శనివారం ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్ శశికళ, కాంట్రాక్టర్ కుళ్లాయినాయక్ నీటి సరఫరాను ప్రారంభించారు. తాగునీటి సమస్య పరిష్కారం కావడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడిన కిరణ్ కుమార్

రాప్తాడు: ప్రసన్నాయపల్లి సమీపంలోని కార్బన్ సిటీ ఎదురుగా 44వ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన మేరకు.. అనంతపురం రూరల్ మండలంలోని పూలకుంటకు చెందిన కిరణ్‌కుమార్ వ్యక్తి గత పనుల నిమిత్తం ద్విచక్ర వాహనంపై అనంతపురానికి వెళ్లాడు. తిరిగి పూలకుంటకు బయల్దేరాడు. రుద్రంపేట మీదుగా వెళ్తుండగా కార్బన్ సిటీ దగ్గరకు రాగానే ద్విచక్రవాహనం అదుపుతప్పి కింద పడిపోయాడు. తలకు తీవ్రగాయాలు కావడంతో 108 వాహనం ద్వారా అనంతపురం సర్వజనాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం నగరంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఆంజనేయులు తెలిపారు.

### రాయితీతో పశువుల దాణా

బుక్కరాయసముద్రం: రాష్ట్ర ప్రభుత్వం రాయితీతో పశువుల దాణా సరఫరా చేస్తోందని పశు సంవర్ధక శాఖ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ రత్నకుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. బీకేఎస్, నార్పల మండలాలకు 25 టన్నుల సంపూర్ణ దాణా వచ్చిందని పేర్కొన్నారు. దాణా టన్ను పూర్తి ధర 15,800 ఉండగా రాయితీతో 9,300 అందిస్తామని తెలిపారు. రైతులు దాణా కోసం బీకేఎస్ ప్రాంతీయ పశు వైద్యశాల, కొర్రపాడు, నార్పల, బి. పప్పూరు, వైద్యశాలల్లో సంప్రదించాలని సూచించారు.

### డీసీఈబీ కార్యదర్శిగా పురుషోత్తం బాబు

రాప్తాడురూరల్: జిల్లా సాధారణ పరీక్షల మండలి (డీసీఈబీ) కార్యదర్శిగా ఖాదర్‌పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పురుషోత్తం బాబును నియమించారు. ఈ మేరకు శనివారం డీఈఓ సాయిరామ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ పని చేస్తున్న లోకేశ్వరరెడ్డి ఇటీవలే మండల విద్యాశాఖ అధికారిగా పదోన్నతి పొంది అన్నమయ్య జిల్లా పీలేరుకు వెళ్లారు. దీంతో ఖాళీగా ఏర్పడిన స్థానాన్ని భర్తీ చేశారు.

# ప్రయాణం ఇక సాఫీ..



బండ్రేపల్లి నుంచి చెర్లోపల్లి రిజర్వాయర్ వరకూ నూతనంగా వేసిన రోడ్డు

- రూ.1.42 కోట్లతో బండ్రేపల్లికి తారు రోడ్డు నిర్మాణం పూర్తి
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

నల్లచెరువు: ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న తారు రోడ్డు కల సాకారమైంది. మండల పరిధిలోని బండ్రేపల్లికి గతంలో మట్టిరోడ్డు మాత్రమే ఉండేది. ద్విచక్ర వాహనాలు కూడా గ్రామంలోకి వెళ్లలేని పరిస్థితి ఉండేది. తమ్మల ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి బండ్రేపల్లికి తారురోడ్డు వేయించాలని గ్రామస్తులు ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. గ్రామస్తుల సమస్యను అర్థం చేసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డి చొరవ తీసుకున్నారు. తమ్మలరోడ్డు నుంచి బండ్రేపల్లికి రోడ్డు వేయించేందుకు ప్రభుత్వం రూ.1.42 కోట్లు మంజూరు చేసింది. దాదాపు 1.78 కిలోమీటర్ల తారు రోడ్డు నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ప్రస్తుతం వాహనాల రాకపోకలు సాఫీగా జరుగుతుండటంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**కష్టాలన్నీ తొలగిపోయాయి**



ఇన్నాళ్లు రోడ్డు కోసం మేం పడిన కష్టాలన్నీ తొలగిపోయాయి. గడప గడపకూ మన ప్రభుత్వం కోసం మా గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డికి రోడ్డు సమస్యను చెప్పుకున్నాం. స్పందించిన ఎమ్మెల్యే రోడ్డు వేయిస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం రోడ్డు వేయించారు. గ్రామస్తులమంతా ఎమ్మెల్యేకి అండగా ఉంటాం.

– లక్ష్మీరెడ్డి, గ్రామస్తుడు, బండ్రేపల్లి

# నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

కదిరి టౌన్: కదిరి రూరల్ మండలం కొండమనాయిన పాల్యం సచివాలయ పరిధిలోని చౌటితాండా నుంచి ఆదివారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ప్రారంభం కానుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి హాజరవుతారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు హాజరుకావాలని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు ఓ ప్రకటనలో కోరాయి.

**రేపు పెద్దన్నగారి పల్లిలో..**

తలుపుల:మండలంలోని పెద్దన్నగారి పల్లి సచివాలయ పరిధిలోని గ్రామాల్లో ఈనెల 31వ తేదీన ఎమ్మెల్యే సిద్దారెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నారు. అధికారులు, నాయకులు పాల్గొనాలని మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు గిరిధర్ రెడ్డి, ఎంపీపీ రఫీ నాయక్ కోరారు.

# గిరిప్రదక్షిణకు ఆర్టీసీ సర్వీసులు

పుట్టపర్తి టౌన్: భక్తుల సౌకర్యార్థం ఈనెల 31న పుట్టపర్తి ఆర్టీసీ బస్టాండ్ నుంచి అరుణాచలం గిరిప్రదక్షిణకు ప్రత్యేక సర్వీసు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ ఇనయతుల్లా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అరుణాచలం గిరిప్రదక్షిణతో పాటు వేలూరు గోల్డన్ టెంపుల్, కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి దర్శనం కూడా కల్పించేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. ఈ బస్సు పుట్టపర్తి ఆర్టీసీ డిపోలో సోమవారం ఉదయం 10 గంటలకు బయలుదేరుతుందన్నారు. ఆన్‌లైన్ ద్వారా, పుట్టపర్తి బస్టాండ్‌లో కూడా టికెట్లు రిజర్వేషన్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 7382860486, 9440201570 నంబర్లు సంప్రదించాలన్నారు.

**ధర్మవరం డిపో నుంచి..**

ధర్మవరం అర్బన్: అరుణాచలంలో గిరి ప్రదక్షిణకు ఈనెల 31వ తేదీన సూపర్ లగ్జరీ బస్సు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ మోతిలాల్‌నాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దలకు రూ.1,400 చార్జీ నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఆన్‌లైన్ లేదా ఆర్టీసీ బస్సు డిపో వద్ద ప్రయాణికులు తమ టికెట్లను రిజర్వేషన్ చేయించుకోవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు 7382860947 నంబర్‌కు సంప్రదించాలన్నారు.